# నచికేతుడు

శ్రీమతి డి. భారతి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

వేదకథాభారతి - 14

# నచికేతుడు

రచన

శ్రీమతి డి. భారతి

ప్రధాన సంపాదకుడు

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య

ప్రచురణ

డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, ఐ. ఏ. ఎస్.,

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1999

VEDAKATHĀ BHĀRATI - 15

**NACHIKETUDU**

by

***Smt. D. Bharathi***

Chief Editor

***Professor S. B. Raghunathacharya***

First edition 1999

Copies : 10,000

Published by :

***Dr. I.V. Subba Rao, I.A.S.,***
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

Price :

*Lasertypeset at*
**ANNAPURNA GRAPHICS**
53, (Upstairs) R.S. Gardens, Tirupati ✆ : 30184

*Printed at*
**MUDRICA OFFSET PRINTERS**
Sanyasiraju St., Gandhi Nagar
Vijayawada ✆ : 579654

# మామాట

**డాక్టర్ ఐ.వి. సుబ్బారావు,** ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

నిత్య సత్యమైన ప్రమాణాలు వేదాలు. మానవజాతి మనుగడకు అడుగడుగునా మార్గదర్శనం చేస్తూ నిస్స్వార్థ బుద్ధితో, త్యాగమయమైన ప్రవృత్తితో తమ తమ జీవితాలను పండించుకున్న ఎందరో మహానుభావుల జీవన వైభవాలు మనకు వేద వాఙ్మయంలో దర్శనమిస్తున్నాయి.

''ఆహా ! ఎటువంటి కర్తవ్యదీక్ష! ఎంత విశాలదృష్టి! ఎటువంటి విశ్వకల్యాణభావన ! ఎంతటి ధార్మిక చేతన !'' అని మనల్ని ఆశ్చర్యపరిచే జీవనవేదం మనకీ వాఙ్మయంలో ప్రత్యక్షమౌతుంది. ఆ వేదనాదాన్ని ఇంటింటా వినిపించాలనే మా ఆకాంక్షకు ప్రతిరూపమే -

**ఈ వేద కథా భారతి.**


వేదకథాభారతిలోని ఎనలేని మానవత్వపు విలువలు ఈ తరాన్ని ప్రభావితం చేయగలిగితే అంతకంటే మాకు ఆనందమేముంటుంది ?

ఈ కథాపుష్పాలను సంపాదించి తీర్చి దిద్ది అందమైన మాలగా రూపొందించిన ప్రొఫెసర్ ఎస్.బి. రఘునాథాచార్య గారిని మనసార అభినందిస్తున్నాను.

ఇంత చక్కగా ముద్రించిన అన్నపూర్ణ గ్రాఫిక్స్ వారికి అభినందనలు.

జయతు జయతు భారతీ
వేద కథా భారతీ

❀ ❀ ❀



# మనవి

వేద కథాభారతి.


అంతశ్శత్రువులను అణచివేసి కొన్ని ఆదర్శాలకు, విలువలకు పట్టంకట్టి, ధార్మిక జీవనానికి ప్రాణంపోస్తూ ఈ లోకంలోనే కాక ఇతరలోకాల వారికి కూడా నిండైన మానవత్వమంటే 'ఇది' అని ఆచరణ పూర్వకంగా నిరూపిస్తూ, అందులోని మధురిమలను చవిచూపిస్తూ వేదనాదవిభాసురమైన ఒక జీవన ప్రవంతి ఈ గడ్డపై వెల్లివిరిసింది.

జలజలసాగే ఆ అమృత వాహిని వసుంధరను రసమయం చేసింది. సస్యశ్యామలం చేసింది. సుగంధపరిమళాలను వెదజల్లే నందనోద్యాలను వెలయించింది. మానవ సృష్టిలో అరుదైన ప్రమాణాలను కొన్నింటిని నిలబెట్టింది. వాటికి కాలదోషం లేదు. ఆనాటికి, ఈ నాటికి, ఏనాటికైనా మానవతకు గమ్యాన్ని, జీవనానికి అర్థాన్ని పరమార్థాన్ని సాధించడంలో ఆ ప్రమాణాలు చరితార్థాలయినాయి. అలాంటి జీవన చిత్రాలకు పట్టిన అద్దమే ఈ వేదకథాభారతి.

ఒక్కసారి పరిశీలించండి ! ఆ చిత్రరామణీయకతను మంచిమనసుతో దర్శించండి ! వారి ఆత్మల ఔన్నత్యాన్ని వారి భావనల ఔచిత్యాన్ని మీరు తప్పక అభినందిస్తారు ! అవి మంచివని తోస్తే అనుసరించచడానికి ప్రయత్నించండి ! ఆనందించండి !

ప్రమాథి - నిజజ్యేష్ఠ
బహుళ - సప్తమి
5-7-1999

ప్రొఫెసర్ ఎస్. బి. రఘునాథాచార్య



# నచికేతుడు

**క్షణకోపి :**

మహర్షి ఉద్దాలకుడు గొప్ప తపస్వి. అతని భార్య విశ్వవార. ఈ పుణ్యదంపతులు అనేక యజ్ఞయాగాలను చేసి సుప్రసిద్ధులైనారు. ఉద్దాలకుడు దానధర్మాలు చేసే స్వభావం కలవాడు. వచ్చిన వారికందరికి ఎప్పుడూ అన్నదానం చేయటం వల్ల అతడికి వాజశ్రవసుడనే పేరేర్పడింది. వాజశ్రవసుడు చాలా గొప్పవాడు. కాని అతడిలో ఒకే ఒక దోషం ఉంది. ప్రతిచిన్న విషయానికి వెంటనే కోపం తెచ్చుకోవడం. అతని ఆవేశానికి హద్దులుండేవి కావు. మళ్ళీ కొంతసేపు ఆగితే ఆకోపమంతా ఎటుపోయేదో చక్కగా ఇతరులను గౌరవంతో ఆదరించేవాడు.

**ఏమీ దిగులుపడకు !**

అతని భార్య విశ్వవార ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఆమె గొప్ప జ్ఞాని. శాంతస్వభావురాలు. భర్తను దైవంగా భావించేది. కాని ఆమెకు సంతానంలేకపోవడం ఎంతో కొరతగా ఉండేది. ఆమెలోగల అసంతృప్తిని గ్రహించిన భర్త -

*"విశ్వవారా! ఎందుకంత బాధపడతావు?*
*నీకు సంతానం కలగదని ఎవరు చెప్పారు?*
*మనమొక యాగం చేద్దాం.*

అన్నివిధాల యోగ్యుడైన పుత్రుణ్ణి దేవతలు మనకిస్తారు.
ఏమీ దిగులుపడకు!'

అన్నాడు. వారిద్దఱుకలసి శ్రద్ధగా ఒక యాగం చేశారు. ఆయాగఫలంగా వారికొక మగబిడ్డ కలిగాడు. అతనికి వారు అల్లారుముద్దుగా నచికేతుడని నామకరణం చేశారు. బాలుడు గొప్ప తేజస్వి. జిజ్ఞాసాపరుడు. బాల్యంలోనే అతనికి అనేక సందేహాలేర్పడుతుండేవి. వాటికి సరిగా సమాధానాలు చెప్పగలవారుండేవారు కాదు.

**విశ్వజిద్యాగం :**

నచికేతుడు ఉదయం లేచి స్నానం చేసి ఆశ్రమవాటికలోని రంగురంగుల పూలుకోసి తల్లికిచ్చేవాడు. తరువాత తల్లితోపాటు గోశాలకు వెళ్ళి గోపూజలో పాల్గొనేవాడు. ఆవులతో దూడలతో ఆడేవాడు. అలా అలా పెరిగి పెద్దవాడైన నచికేతునికి ఉపనయనం చేసి విద్యాభ్యాసంకోసం గురుకులంలో చేర్చాడు వాజశ్రవసుడు.

కొన్నిరోజుల తరువాత ఉద్దాలకుడు విశ్వజిద్యాగం ప్రారంభించాడు. యాగం దాదాపు పూర్తయింది. అది సర్వస్వదక్షిణాక యాగం. ఈ యాగం చేసే వ్యక్తి తనకున్న సర్వస్వం అందరికి దానం చేసేయాలి. విశ్వజిత్‌యాగం ముగిసేముందు వాజశ్రవసుడు నీరుత్రాగటానికి, పాలివ్వటానికి శక్తిలేని ఉపయోగంలేని ముసలిగోవులను యాగం చేసిన ఋత్విక్కులకు దక్షిణలుగా ఇవ్వదలిచాడు.

**నన్నెవరికి దానం చేస్తారు?**

తన తండ్రి స్వర్గం పొందాలనే కోరికతో ఎందుకూ పనికిరాని గోవులను దానం చేయటం నచికేతునికి ఆశ్చర్యం కల్గించింది.

"మీరు చేస్తున్న యాగంలో మీకున్న సర్వసంపదలు దానం చెయ్యాలి కదా! నేను కూడా మీకున్న సంపదలలో ఒకణ్ణి. మరి నన్నెవరికి దానం చేస్తారు?

అని నచికేతుడు తన తండ్రిని ప్రశ్నించాడు. వెంటనే తండ్రి సమాధానం చెప్పలేదు. కాని నచికేతుడు రెండు మూడుసారులు అలాగే ప్రశ్నించి తండ్రిని విసిగించాడు. తండ్రికోపంతో -

"నిన్ను యమునికి దానం చేస్తాను"

అన్నాడు.

**యమునికోసం మూడు రాత్రులు :**

నచికేతుడు తండ్రిమాటలకు ఎంతో ఆశ్చర్యపడ్డాడు. ఇలా ఆలోచించాడు -

"నా తండ్రికి ఉన్న కొడుకులలో, శిష్యులలో నేను శ్రేష్ఠుణ్ణే కాకపోయినా ఎందుకు పనికిరానివాణ్ణే మాత్రంకాదు. ఆయన నన్ను యమునికి దానం చేస్తాననడం కేవలం కోపం వల్లనే. యమునికి నావల్ల ఏమి ప్రయోజనం? ప్రయోజనం ఉన్నా లేకపోయినా తండ్రి అన్నమాట ప్రకారం యముని దగ్గరకు వెళ్ళితీరాలి"

అని నిశ్చయించుకున్నాడు.

నచికేతుడు వెంటనే యముని ఇంటికి వెళ్ళాడు. కాని యముడు

ఆ సమయంలో బ్రహ్మదర్శనానికి వెళ్ళాడు. నచికేతుడు యమునికోసం ఎదురుచూస్తూ ఆయన గృహంలో మూడు రాత్రులు గడిపాడు. ఏమీ తినకుండా ఉపవాసం కూడా చేశాడు. మూడురోజుల తరువాత యముడు తిరిగి వచ్చాడు. అతని సేవకులు బ్రహ్మతేజస్సుతో ప్రకాశిస్తున్న నచికేతుని గురించి యమునకు చెప్పారు. యముడు నచికేతుని దగ్గరకు వచ్చి -

*''ఓ బ్రాహ్మణకుమారా! నీకు నమస్కారం. నీవు పూజింపతగిన అతిథివి. నీవు నా ఇంట్లో మూడు రాత్రులు భోజనం చేయకుండా ఉపవాసం చేశావు. బ్రాహ్మణుడు అగ్నిదేవునితో సమానం. నీవు మూడు రాత్రులు నా ఇంట్లో ఉపవాసం చేసినందులకు మూడు వరాలిస్తాను కోరుకో!''*

అన్నాడు.

**నచికేతుని మొదటివరం :**

నచికేతుడు యమధర్మరాజుతో సరే, అలాగేనని మొదటివరం ఇలా కోరుకుంటాడు -

*''నేను ఇక్కడినుండి ఇంటికి తిరిగి వెళ్ళగానే మా తండ్రికి నాపై కోపం పోయి నన్ను ప్రేమతో పలకరించి దగ్గరకు తీసుకోవాలి''.*

అప్పుడు యముడు నచికేతునితో నువ్వు ఇంటికి వెళ్ళగానే మీనాన్న కోపం అంతాపోయి నిన్ను ప్రేమతో పలకరించి దగ్గరకు

చేరదీస్తాడు. నిన్ను చూసిన వెంటనే ఆయన హృదయం ఆనందంతో ఉప్పొంగిపోతుంది! అని మొదటివరం ప్రసాదిస్తాడు యముడు.

**అగ్నివిజ్ఞానాన్ని ఉపదేశించండి!**

నచికేతుడు యమధర్మరాజుని రెండవవరం ఇలా కోరాడు -

''స్వర్గలోకంలో మృత్యువును గురించిన భయం లేదని విన్నాను. అక్కడ మృత్యువు రాదు, ముసలితనం భయపెట్టదు. ఆకలిదప్పికలు అసలు దగ్గరకు రావు. దుఃఖం అనేది ఉండదు. అదే స్వర్గసుఖం. అటువంటి స్వర్గప్రాప్తి పొందేమార్గం ''అగ్నివిజ్ఞానం'', అది నీకు తెలుసు. నాకు ఆ స్వర్గసాధకమైన ''అగ్నివిజ్ఞానం'' ఉపదేశించు.

**నీపేరుతోనే ప్రసిద్ధమౌతుంది :**

యముడు సరేనన్నాడు. నచికేతుడికి అగ్నివిజ్ఞానం సమస్తం ఉపదేశించాడు. నచికేతుడు ఆ ఉపదేశాన్ని పూర్తిగా గ్రహించాడు. తనకు అగ్నివిజ్ఞానం బాగా తెలిసినదని నిశ్చయం చేసుకోవటానికి తను నేర్చుకున్న అగ్నివిజ్ఞానం అంతా యమునికి తిరిగి వప్పచెప్పాడు. యముడు అతని మేధాశక్తికి మెచ్చి అతని పేరుతో ఆ అగ్ని ''నచికేతాగ్ని'' అని లోకంలో ప్రసిద్ధి చెందుగాక! అని రెండవవరాన్ని ప్రసాదించాడు. నీ పేరున ప్రసిద్ధి గాంచిన ఈ క్రతువిజ్ఞానాన్ని తెలిసికొనినవాడు, ఈ క్రతుమంత్రాలను మూడుసార్లు అధ్యయనం చేసినవాడు ''త్రినాచికేతుడు'' అనిపించుకొంటాడు. జ్ఞానకర్మల అనుష్ఠానంతో వైరాజ పదవిని పొందుతాడు. ఈ నాచికేతాగ్నిచయనం చేసిన వానికి అధర్మం అంటదు. రాగద్వేషాలు దగ్గరకు రావు. అలాంటివాడు స్వర్గంలో సంతోషంగా ఉంటాడు.

నచికేతుడు కోపంతో తన తండ్రి హృదయం తల్లడిల్లకుండా ప్రేమతో తనను దగ్గరకు తీసుకొనేటట్లు వరం కోరుకొన్నాడు. ఆ తర్వాత చనిపోయిన తర్వాత ఆనందాన్ని కల్గించే స్వర్గసుఖానికి సాధనంకోరుకొన్నాడు. ఈ రెండువరాలు లభించాయి. కాని ఈ రెండు వరాలు నచికేతుని ఆధ్యాత్మికజిజ్ఞాసను తీర్చి తృప్తిపరచలేకపోయాయి.

**ఆత్మతత్త్వాన్ని ఉపదేశించు !**

నచికేతుడు మూడవ వరంగా '' ఆత్మతత్త్వాన్ని'' బోధించమని ఇలా కోరాడు -

> *''యమధర్మరాజా! పుట్టిన ప్రతి మానవునికి మరణం సహజం. మానవుడు మరణించినప్పుడు తోటి మానవునికి ఈ సందేహాలు వస్తాయి. చనిపోయిన తర్వాత మనిషి ఏమౌతాడు? మనిషి శరీరంలో ఆత్మ ఉందని, ఆ ఆత్మ మనిషి చనిపోయిన తర్వాత కూడా ఉంటుందని వాదిస్తున్నారు. ఈ విషయంలో సత్యాన్ని నాకు చెప్పండి''*

అని నచికేతుడు యముణ్ణి మూడవ వరం కోరాడు.

**ఇంకేమీ అక్కఱలేదు :**

ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవటానికి అందరికి అర్హత ఉండదు కనుక నచికేతుని అర్హతను యముడు పరీక్షింపదలచాడు.

> *''నచికేతా! ఆత్మతత్త్వాన్నిగురించి దేవతలకు కూడా సంశయమే ఉంటుంది. ఆ ఆత్మ విషయం అతిసూక్ష్మమైంది.*

సామాన్యజనుల జ్ఞానానికి అందని విషయం అది. లోకంలో ఎవరికీ లభించని సకలభోగాలను కోరుకో ఇస్తాను''

అని నచికేతుణ్ణి అనేక విధాల మభ్యపెట్టాడు.

''నచికేతా! నీవు ఈ వరం తప్ప ఏదైనా కోరుకో ఇస్తాను. కాని ఈ మరణ సంబంధమైన ప్రశ్న అడగవద్ద'' ని అనేక విధాల వారించాడు. కానీ యమునితో నచికేతుడు -

''నీవు చెప్పిన భోగాలన్నీ అశాశ్వతాలు. ఈ భోగాలన్నీ శాశ్వతంగా ఉండవు. ఇవన్నీ నాకవసరంలేదు. వివేకజ్ఞానం కలవాడెవ్వడు క్షణికమైన భోగాలను కోరడు''.

శ్రేయోమార్గం - ప్రేయోమార్గం :

యముని మాటలు నచికేతుని అచంచల హృదయాన్ని కదిలింపలేకపోయాయి. యముడు నచికేతుని పట్టుదలకు మెచ్చి ఆత్మతత్త్వాన్ని, లోకప్రవృత్తిని ఇలా ఉపదేశించాడు -

''నచికేతా! మనిషి అనుసరించడానికి రెండు మార్గాలున్నాయి. మొదటిది శ్రేయోమార్గం. రెండవది ప్రేయోమార్గం. శ్రేయోమార్గం అంటే 'సత్యం' శాశ్వతమైన సుఖంకలిగే మార్గం. ఇది విద్యవల్ల కలుగుతుంది. మొదట కష్టం అనిపించినా చివరకు శాశ్వతసుఖం లభిస్తుంది. పండితులు ఈ మార్గాన్నే అనుసరిస్తారు. ప్రేయోమార్గం అంటే తాత్కాలిక సుఖం కల్గించేది. ఇది మొదట సుఖం కల్గించినప్పటికి చివరకు

కష్టమనుభవించక తప్పదు. ఈ మార్గాన్ని పండితులు ఎన్నటికీ అనుసరించరు. ఈ రెండు మార్గాలు ఒకదానితో ఒకటి మానవుని సమీపిస్తాయి. పండితుడైనవాడు ఈ రెండింటిని బాగా విచారించి శ్రేయోమార్గమే అవలంబిస్తాడు.

యముడు నచికేతునితో ఇంకా ఇలా అన్నాడు -

''నీవు స్త్రీపుత్ర ధనభోగాలను శాశ్వతమైనవికావని ఆలోచించి త్యాగం చేశావు. లోకంలో మానవులందరు ఆశపడే ధనాన్ని నీవు ఆశించలేదు. విద్యావిద్యలు చీకటి వెలుగులలాగా భిన్న స్వభావాలు కలవేగాక భిన్న ఫలాలనిచ్చేవని కూడా తెలుసు. ఆరెండింటిలో నిన్ను విద్యను కోరుకొన్న వానినిగా అనుకుంటున్నాను. ఎందుకంటే కామోపభోగాలు నిన్ను ఆకర్షింపలేకపోయాయి. అజ్ఞానం కలవాళ్ళు తావే గొప్పవాళ్ళమని, శాస్త్రం తెలిసినవాళ్ళమని అనుకుంటారు. అలాంటి మూర్ఖులు ఒక గుడ్డివాని వెంటవెళ్లే ఇతరగుడ్డివాళ్లలాగా జనన మరణవ్యాధి దుఃఖాలతో కూడిన చెడుమార్గాన్ని అనుసరిస్తారు. చాలామంది మానవులకు ఆత్మవిద్య తెలుసుకోవటానికి అవకాశం లభించదు. విన్నవారు అందరూ ఆత్మతత్వాన్ని గ్రహింపలేరు. ఆత్మవిద్య బోధించటం అందరికి సాధ్యం కాదు. ఈ ఆత్మను గురించి సామాన్యుడైన మానవునికి చెప్పినా అర్థం కాదు. బ్రహ్మజ్ఞాని యైన ఉత్తమగురువు దగ్గఱ ఉపదేశం పొందితే ఎలాంటి

సందేహం ఉండదు. ఆత్మ ఉందని, లేదని అనేకవిధాల పండితులు వాదిస్తుంటారు. ఆత్మను గురించి ఉత్తమగురువే ఉపదేశించాలి. ఆత్మస్వరూపం ఊహకందని విషయం. ఆత్మ అణువుకంటే మిక్కిలి సూక్ష్మమైంది. నీవు మంచిపట్టుదల కలవాడివి. నీలాగా మంచివిషయాలలో ఆసక్తిగల విద్యార్థులు మాకు మళ్ళీ మళ్ళీ లభించాలి.

అగ్నిహోత్రయాగం వల్లనే ఈపదవి :

యముడు నచికేతునితో ఇలా అన్నాడు -

''నేను కర్మఫలం అనిత్యమని తెలుసుకున్నాను. అనిత్యాలైన కర్మరూప సాధనాల ద్వారా నిత్యమైన పరమాత్మ అనే పదార్థం తెలుసుకోవాలంటే సాధ్యం కాదు. నేను ఏ అగ్నికి నీ పేరు పెట్టానో ఆ 'నాచికేతాగ్నిహోత్రం' ఎంతోకాలం చేశాను. అనిత్యమైన ఆకర్మలవల్లనే ఈ యమపదవి పొందాను. ఓ నచికేతా! నీవు ఈ లోకస్థితిని తెలిసికొని ఈ ఐశ్వర్యాలు, భోగభాగ్యాలు, కోరికలు, స్వర్గఫలాన్నిచ్చే యాగాలే. ఇవన్నీ ప్రయోజనం లేనివని తెలుసుకుని వాటిని ధైర్యంగా వదిలేశావు. నీవు సర్వశ్రేష్ఠుడవైన ధీరుడివి.

ఆత్మ అతిసూక్ష్మమైంది కావడంవల్ల మనకళ్ళతో చూడటానికి వీల్లేదు. అది అతిప్రాచీనమైనది. హృదయం అనే గుహలో ఉంటుంది.

అలాంటి విశిష్టగుణాలుగల ఆత్మను గురించి తెలుసుకోవాలంటే మనస్సును ఇతరవిషయాలనుండి మరల్చాలి. ఆత్మలోనే ఉండేటట్లు గట్టి ప్రయత్నం చేయాలి. ఆధ్యాత్మయోగబలంచేత ధీరుడైనవాడు ఆత్మతత్త్వాన్ని గ్రహించి సుఖదుఃఖాలను వదిలిపెట్టాలి. ఆత్మతత్త్వాన్ని బాగా గుర్తించిన మానవుడు చక్కగా గ్రహించి ఆత్మను శరీరం నుంచి వేరుచేసి సూక్ష్మమైన ఆత్మను తెలుసుకోగలుగుతాడు. పండితుడైన మానవుడు గొప్ప ఆత్మను పొంది మిక్కిలి ఆనందిస్తాడు.

నచికేతుడు యమధర్మరాజుతో ఇలా అన్నాడు -

''నేను యోగ్యుడనని నీవనుకుంటే ధర్మాధర్మాలకంటే, ప్రపంచంకంటే, భూత భవిష్యద్వర్తమాన కాలాలకంటే భిన్నంగా నీవు దేనిని చూస్తున్నావో దాన్ని నాకు ఉపదేశించు!

అని యముణ్ణి నచికేతుడు అభ్యర్థించాడు. అప్పుడు యముడు నచికేతునితో ఇలా అన్నాడు-

''దేనిని పొందాలని ఎందఱో కఠినమైన తపస్సు చేస్తారో, ఏది సర్వవేదసారభూతమైందో అదే ఓంకారం. ఈ ఓంకారమే పరబ్రహ్మస్వరూపం. ఓంకారం నాశనం లేనిది. ఓంకారాన్ని తెలిసికొన్నవారికి ఏదికోరితే అదే లభిస్తుంది. బ్రహ్మప్రాప్తికి మూలభూతమైంది ఓంకారం. దీన్ని తెలుసుకొన్నవాడు బ్రహ్మలోకంలో బ్రహ్మలాగా ప్రకాశిస్తాడు.''

**ఆత్మ శాశ్వతమైంది :**

ఆత్మకు మరణం లేదు. ఆత్మపుట్టదు, మరణించదు. ఆత్మ శాశ్వతమైంది. శరీరం నశించిపోయినా ఆత్మ నశించదు. ఆత్మ అణువుకంటే సూక్ష్మమైంది. నిష్కామకర్మచేసేవాడు మనస్సు బాహ్యేంద్రియాల నియంత్రణవల్ల ఆత్మమహిమను గ్రహిస్తాడు. అప్పుడతడికి శోకమనేది ఉండదు. ఆత్మ దేనినీ చంపదు. దేనిచేత చంపబడదు. ఆత్మ అణువు కంటే అతిసూక్ష్మమైంది. ఆత్మ జీవుని హృదయరూపగుహలో ఉంటుంది.

వేదాలు చదవటంవల్ల పరమాత్మ ఎవరికీ లభించడు. పాండిత్యంద్వారా ఆత్మస్వరూపం తెలియడం కష్టం. మరి పరమాత్మను ఎలా తెలుసుకోవాలి? కేవలం ఆయనపై నున్న భక్తిద్వారానే తెలుసుకోవాలి. ఇంకా యమధర్మరాజు నచికేతునికి ఇలా ఉపదేశించాడు-

**జీవాత్మ - పరమాత్మలు :**

''మోక్షం పొందాలంటే మానవుడు సత్కర్మలనాచరించాలి. ఇంద్రియాలను జయించాలి. మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి. దృష్టి దేనిమీద ఉండకూడదు. ఈ లక్షణాలున్నవాడు మోక్షం తప్పకుండా పొందగలుగుతాడు. ప్రతిమానవుడి హృదయంలో ఛాయాతపాలలాగా భిన్నలక్షణములు గల రెండు తత్త్వాలు కర్మఫలాన్ని అనుభవిస్తున్నాయని పండితులు చెబుతారు. ఛాయ అంటే నీడ. ఆతపమంటే ప్రకాశం. అంధకారంలో ప్రకాశం ఉండదు. ఛాయలో ప్రకాశం ఉంటుంది. కాని సంపూర్ణంగా ఉండదు. ఛాయ ప్రకాశంద్వారానే ఏర్పడుతుంది. సూర్యకాంతి లేకపోయినా ఛాయ ఉండదు. ఛాయ అనగా

జీవాత్మ. పరమాత్మ స్వయంప్రకాశం. జీవాత్మ పరమాత్మ వల్లనే ఏర్పడుతుంది.

వివేకులైనవారు ఇంద్రియాలు అశ్వాలవంటివని చెబుతారు. శరీరేంద్రియ మనోయుక్తమైన ఆత్మను ''భోక్త'' అంటారు. మనస్సుతోకూడి ఆత్మ నేత్రముల ద్వారా రూపమును చూస్తుంది. ఇంద్రియ సంబంధం లేనపుడు ఆత్మ సుఖదుఃఖాలననుభవించదు. ఆత్మ బుద్ధివశంలోలేని ఇంద్రియాలవల్ల ప్రమాదంలో పడుతుంది. ఎవరి మనస్సు బుద్ధిస్వాధీనంలో ఉండి విజ్ఞానవంతమైయుంటుందో వారి ఇంద్రియాలు బుద్ధికి స్వాధీనమై ఉంటాయి.

**అదే పరమాత్మ తత్త్వం :**

ఏమానవుడు విజ్ఞానమనే సారథితోకూడి మనస్సనే కళ్ళెం కలవాడై ఉంటాడో అతడు సంసారసాగరం దాటి పరమాత్మను పొందుతాడు. ఇంద్రియాలకంటే ఇంద్రియ విషయాలు శ్రేష్ఠాలు. ఆ ఇంద్రియవిషయాలకంటే మనస్సు గొప్పది. మనస్సు కంటే బుద్ధి గొప్పది. ఆబుద్ధికంటే ఆత్మ గొప్పది. జీవాత్మకంటే మాయాశక్తి గొప్పది. ఆమాయకంటెను పరమాత్మగొప్పవాడు. పరమేశ్వరునికంటే గొప్పవాడు లేడు. ఆపరమాత్మతత్త్వమే పరమావధి. అదే సమస్తానికి ఉత్తమగతి.

తరువాత యమధర్మరాజును నచికేతుడిలా ప్రశ్నించాడు ''ఆత్మ అందరిలోను ఉంటుందా? అది అందరికి కనపడదా''? దానికి యముడిలా సమాధానం చెప్పాడు -

''అన్ని ప్రాణులలోను ఆత్మ ఉంటుంది. అది మన కంటికి కనిపించదు. అది జ్ఞానవంతుల జ్ఞాననేత్రానికే కనిపిస్తుంది. ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, మహత్తత్వం వీటిలో ఒకదాని కంటె మరొకటి గొప్పది. కావున ఇంద్రియాలు మనస్సు చేతను, మనస్సు బుద్ధిచేతను, బుద్ధి మహత్తత్త్వం చేతను, మహత్తత్త్వం ఆత్మచేతను సాధకుడు నియమించుకోవాలి. ఇది సాధనమార్గం. పరమాత్మ యొక్క యథార్థస్థితిని గ్రహించిన మానవులు జననమరణరహితమైన మోక్షాన్ని పొందుతారు.

**ప్రాపంచిక సుఖాలను కోరుకోవద్దు :**

పరమాత్మ ఇంద్రియాలకు బాహ్యదృష్టినే ప్రసాదించాడు. అందుకే జీవుడు బాహ్యవిషయాలనే చూడగలుగుతున్నాడు. కాని అంతరాత్మను చూడలేకపోతున్నాడు. అమరత్వం పొందాలంటే ఇంద్రియాలను బాహ్యవిషయాలనుంచి మరల్చి పరమాత్మను చూడగలగాలి. అల్పుడైన మానవులు లౌకికభోగాలను అనుభవించగోరి జననమరణాలను పొందుతూ కష్టాలను అనుభవిస్తున్నారు. విజ్ఞానవంతులైన మానవులు శాశ్వతమైన అమరత్వాన్ని పొందగోరి ప్రాపంచికవిషయాలను, సుఖాలను కోరుకోరు. ఆత్మకు తెలియనిది ఏదీలేదు. పరమాత్మ అంతటు వ్యాపించి ఉంటాడు.

''నచికేతుడు తెలుసుకోగోరిన ఆత్మతత్త్వం దేవతలకు కూడా సంశయాస్పదమైన పరమాత్మతత్త్వం ఇదే.

యముడు మళ్ళా ఇలా ఉపదేశించసాగాడు -

''ఎవరు ఆత్మప్రభావం వల్ల స్వప్నావస్థలో జాగ్రదవస్థలో కంటికి కనపడే పదార్థాల తత్త్వాన్ని చక్కగా గ్రహిస్తారో వారు అంతట వ్యాపించి ఉన్న పరమాత్మను గ్రహించలేరు.'' ఏ పరతత్వం ఈ దేహేంద్రియ సమూహంలో ప్రకాశిస్తున్నదో ఆ పరతత్వమే దేహాదులకంటె భిన్నమైన ప్రదేశంలో ప్రకాశిస్తున్నది.

**పదకొండు ద్వారాలు :**

విజ్ఞానస్వరూపి ఆత్మ. ఆత్మ భౌతికశరీరం. ఏకాదశద్వారాలు కలది. ఏకాదశద్వారాలంటే బ్రహ్మరంధ్రం, రెండు కళ్ళు, రెండు చెవులు, రెండు నాసికారంధ్రాలు, ముఖద్వారం, నాభి, మూత్రద్వారం, మలద్వారం. అలాంటి శరీరాన్ని అధివసించే ఆత్మను ధ్యానించే మానవుడు ఎన్నటికీ దుఃఖించడు. అతడు ఈ శరీరం ఉండగానే కర్మబంధాలనుంచి విముక్తుడవుతాడు.

ఓ నచికేతా! నీకు మరల సనాతనమైన పరమాత్మను గురించి వివరించి చెప్తాను- బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకోపోవటంవల్ల మరణించిన తరువాత ఆత్మ ఏమౌతుందో దాన్ని గూడ నీకు చెబుతాను. విను.

**ఎవ్వరూ అతిక్రమించలేరు :**

లోకంలోని జీవుల్లో కొందఱు తమ జ్ఞానకర్మానుసారం ప్రాణిరూపం ధరిస్తారు. మరికొన్ని జీవులు వృక్షాలు మొదలైన స్థావరాలుగా జన్మిస్తాయి. ప్రళయకాలంలో అన్ని జీవులు నశించినప్పుడు ఏపురుషుడు తన ఇష్టానుసారంగా పదార్థాలను సృష్టిస్తాడో అతడే

పరిశుద్ధమైన పరమాత్మ. అన్నిలోకాలు నాశనంలేని ఆపరమాత్మనే ఆశ్రయించి ఉన్నాయి. ఎవరూ ఆ పరమాత్మను అతిక్రమించలేరు. ఇదే పరతత్త్వస్వరూపం.

సూర్యుడు తన కిరణాలతో అశుచి పదార్థాలను తాకినప్పటికి ఆమాలిన్యం అతనికి అంటదు. అలాగే అన్ని ప్రాణుల్లోను ఉన్న ఒకే పరమాత్మ ఆయా జీవులు చేసిన పుణ్యపాపాలను అంటడు. పరమాత్మ ప్రాణులకు అతీతంగా లోపల ఉంటాడు. అన్నిలోకాలను తన వశంలో ఉంచుకొని ఆపరమేశ్వరుడు అన్నిప్రాణుల్లోను అంతర్యామిగా తన రూపాన్నే అనేక విధాలుగా చేస్తాడు. ఏ పండితులు తమ బుద్ధిలో ఆత్మస్వరూపాన్ని చూస్తారో వారికి శాశ్వతసుఖం లభిస్తుంది. అలా చూడనివాళ్ళకు శాశ్వతసుఖం లభించదు. పరమాత్మయొక్క ప్రకాశం చేతనే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి.

ఈ జగత్తంతా బ్రహ్మవలన పుట్టి బ్రహ్మవలననే ప్రవర్తిస్తున్నది. ఎవరు ఈ తత్త్వాన్ని గ్రహిస్తారో వారు అమరులౌతారు. పరమాత్మవల్లనే అగ్ని దహించటం సూర్యుడు ప్రకాశించటం జరుగుతున్నాయి.

స్థిరమైన ఇంద్రియనిగ్రహాన్ని ''యోగం'' అంటారు. యోగం సృష్టినాశరూపమైంది. యోగస్థితిలో ఉన్న సాధకుడు ప్రమాదాన్ని పొందడు. పరమాత్మ వాక్కుచేతను, మనస్సుచేత, నేత్రంచేత లభ్యమయ్యేదికాదు. ఆత్మ ఉందని నమ్మినవారికే ఎప్పుడో ఒకప్పుడు ఆత్మసాక్షాత్కారం లభిస్తుందిగాని నాస్తికులకు ఎప్పటికీ పరమాత్మ లభించడు. మానవుని హృదయంలో కోరికలు ఎప్పుడు నశిస్తాయో అప్పుడే మానవుడు అమరుడౌతాడు.

అంతట వ్యాపించి ఉన్న ఆత్మను మాటలలో చెప్పటం కష్టం. ఆత్మకు ఆది, మధ్యం, అంతం లేదు. అది అంతులేనిది. అణువుకంటే చిన్నది. ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవటం చాలా కష్టం.

నచికేతా! కోరికలన్నింటినీ పొందు! పరమసత్యాన్ననుభవించు! ఈ ఆత్మతత్త్వం అర్థం చేసుకోవటం చాలా కష్టమైన విషయం. ఇది తెలిసికొన్నవానికి విజయం లభిస్తుంది.

**ఆత్మసాక్షాత్కారం అతికష్టసాధ్యం :**

పరమాత్మయే సమస్తానికి అధిష్ఠానం. మానవుడు అనేకమైన పనులు తలబెడతాడు. ఆపనులవల్ల అతనికి ఆనందం లభిస్తున్నదనే భావంతో ఆపనులకు పూనుకుంటాడు. ఆనందం దొరకదంటే ఏమనిషీ ఏపనీ చేయడు. జగత్తులో ఏదీ పరిపూర్ణమైన ఆనందాన్నివ్వలేదు. ఆత్మతత్త్వమే పరిపూర్ణానందాన్ని ప్రసాదించగలదు.

ఈ ఆత్మ సర్వవ్యాపకం. ఊర్ధ్వలోకాల్లో, అధోలోకాల్లో అన్నిటా అదే ఉంది. ఇట్టి ఆత్మానుభూతి మనస్సు పవిత్రమై, పరిశుభ్రమైనపుడు మాత్రమే కలుగుతుంది. పరిశుభ్రమైన ఆహారం స్వీకరించినపుడు మానవుని మనస్సు పరిశుభ్రమవుతుంది. పవిత్రమూ, పరిశుభ్రమూ అయిన మనస్సు కలవానికే ఆత్మసాక్షాత్కారమౌతుంది''.

నచికేతుడు ఈ ఆత్మవిద్యను సంపూర్ణంగా తెలిసికొని బ్రహ్మభావం పొందాడు. ఇలా నచికేతుడు ఆత్మతత్త్వం గురించి యమునిదగ్గర ఉపదేశం పొంది భూలోకానికి తిరిగి వచ్చాడు.

ఏమిటీ తేజస్సు?

యమధర్మరాజు చేసిన ఈ దివ్యోపదేశం ప్రపంచమంతా వినపడింది. భారతదేశంలోని అన్ని ఆశ్రమవాటికల్లోను ఆ ఉపదేశం ప్రతిధ్వనించింది. వాజశ్రవసుని ఆశ్రమంలోను ఇది అందరికీ వినపడింది. వాజశ్రవసుడు యజ్ఞశాలనుంచి ఆవేగంతో బయటకువచ్చి ఆశ్రమంవంక చూస్తూ నిలబడ్డాడు. ఆకాశంనుంచి ఏదో అద్భుతమైన తేజఃపుంజం భూమిమీదకు దిగటం గమనించాడు. అది నెమ్మదిగా ఆశ్రమంలో దిగింది.

*''ఆహా! ఆశ్చర్యం !''*

*''అతనెవరోకాదు. నచికేతుడు.''*

ఆశ్రమవాసుల ఆశ్చర్యానికి అంతులేదు. విశ్వవార బిడ్డను దగ్గరకు తీసుకొని ముద్దాడింది. ఉద్దాలకుడు తన కుమారుని గొప్పదనానికి లోలోపల గర్వపడ్డాడు. విశ్వవార ఇలా అంది -

**ఎలా ఉన్నావు నాన్నా !**

*''నాన్నా! నీ కింత తేజస్సు ఎలా వచ్చింది?*

*'' ఎవరు నీకీ నవరత్నములను బహూకరించారు? అసలు నీ విన్ని రోజులు ఎక్కడున్నావు? ఎలా ఉన్నావు?''*

నచికేతుడు తల్లిదండ్రులకు ఆశ్రమవాసులకు జరిగిన సంఘటనను చక్కగా వివరించాడు. యముడు చేసిన ఆత్మతత్త్వోపదేశాన్ని సంగ్రహంగా వివరించాడు. అందరు ఆనందించారు.

విశ్వవారను, వాజశ్రవసుణ్ణి ఇలా అభినందించారు -

*"మీరెంత అదృష్టవంతులు! ఇంత మంచి బిడ్డను కన్న మీరు నిజంగా అభినందనీయులు. ఇతనివల్ల విశ్వజిద్యాగం యొక్క ఫలితం రెట్టింపయింది. ఇతణ్ణి మనం గౌరవించాలి. ఎందుకంటే ఇతడి వల్లనే "నచికేతాగ్ని" ఈ లోకానికి వచ్చింది. ఇతని వల్లనే ఆత్మవిద్య భూలోకానికి వచ్చింది. నచికేతుడు చిన్నవాడైనా మహర్షిత్వాన్ని పొందగలిగాడు."*

విశ్వవార - ఉద్దాలకులు అందటికి కృతజ్ఞతలందించారు.

నచికేతుడి కథ చక్కగా కఠోపనిషత్తులో బోధింపబడింది. అంత చిన్న వయస్సులో పట్టుదలతో యమలోకానికి పోయి, ఆయన ప్రశంసలందుకొని, నచికేతాగ్నిని తిరిగి భూలోకానికి తీసుకొనివచ్చిన ఘనత నచికేతునికే దక్కింది.

*ఓం శాంతిః శాంతిః శాంతిః*

❁ ❁ ❁

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

CENTENARY CELEBRATIONS OF SRI VENKATESWARA VEDA PATHASALA

★ DHARMAGIRI ★

&

VEDA AGAMA SILPA SADAS

5-7-1999 To 8-7-1999